



కాళోజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ మను చౌదరి

కాళోజీ ఆశయాలు భవిష్యత్ తరాలకు ఆదర్శం

» మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టర్ మను చౌదరి

మేడ్చల్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కోసం నిత్యం పరితపించిన కవితామూర్తి కాళోజీ నారాయణరావు అని కలెక్టర్ మనుచౌదరి అన్నారు. ఆయన ఆశయాలు భవిష్యత్ తరాలకు ఆదర్శమని కొనియాడారు. మంగళవారం జిల్లా యువజన క్రీడా శాఖ ఆధ్వర్యంలో ఆయన జయంతిని పురస్కరించుకుని కాళోజీ చిత్రపటంకు కలెక్టరేట్‌లో పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ మాండలికానికి నిలువుటెత్తు నిదర్శనం కాళోజి అని అన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ హరిప్రియ, జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




కాళోజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జిల్లా అధికారులు

ప్రజాకవి సేవలు మరువలేనివి

» వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పుట్టుక, చావులు కాకుండా బతుకంతా తెలంగాణకే అంకితం చేసిన మహనీయుడు ప్రజాకవి కాళోజీ నారాయణరావు అని, ఆయన సేవలను మరువలేమని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. మంగళవారం ఆయన జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైతాళికుడు, నిజాం దమన నీతికి, నిరంకుశత్వానికి, అరాచక పాలనకు వ్యతిరేకంగా తన కలాన్ని ఆయుధంగా మార్చుకున్నాడన్నారు. దేశ రెండో అత్యున్నత పౌర పురస్కారం పద్మవిభూషణ్ అందుకున్నారన్నారు. ఆయన జయంతిని తెలంగాణ ప్రభుత్వం భాషా దినోత్సవంగా ప్రకటించడం గర్వకారణమన్నారు కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుధీర్, ట్రైనీ కలెక్టర్ హర్ష్‌చౌదరి, ఆర్డీవో వాసుచంద్ర, బీసీ వెల్ఫేర్ అధికారి మాదవ రెడ్డి, జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



అతివా.. ఆరోగ్యమస్తు

నిరంతరం కుటుంబం కోసం శ్రమించే మహిళలు పని ఒత్తిడి, ఇతర కారణాలతో ఆరోగ్య సమస్యలకు గురవుతుంటారు. జాగ్రత్తలు తీసుకోకపోవడం, ఆహార అలవాట్ల కారణంగా నానాటికి తీవ్రమైన వ్యాధుల బారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం, దేశం బాగుంటుందని కేంద్ర ప్రభుత్వం భావించి ఈ నెల17న బృహత్తర కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఇందులో భాగంగా మహిళలకు 15 రోజులపాటు వైద్య పరీక్షలు చేసి అవసరమైన సేవలు అందించనున్నారు. ఇందుకోసం ఉమ్మడి జిల్లాలో వైద్యాధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

మహిళల ఆరోగ్యమే లక్ష్యంగా కార్యక్రమాలు



- ప్రత్యేక వైద్య నిపుణుల ఆధ్వర్యంలో స్క్రీనింగ్
- 15 రోజులపాటు వైద్య పరీక్షలు, సేవలు
- 17న 'స్వాస్థ్‌నారీ, స్వశక్త్ అభియాన్'కు శ్రీకారం
- ఉమ్మడి జిల్లాలో మెగా క్యాంపులకు ఏర్పాట్లు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి): ప్రధాని నరేంద్ర మోదీ 75వ జన్మ దినోత్సవం సందర్భంగా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ రెండో తేదీ వరకు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న స్వాస్థ్ నారీ, స్వశక్త్ పరివార్ అభియాన్(అతివా ఆరోగ్యమస్తు) కార్యక్రమాలకు శ్రీకారం చుడుతోంది. గతంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఆరోగ్య మహిళా కార్యక్రమం రీతిలోనే ఈ కార్యక్రమం కొనసాగనుంది. ఈ కార్యక్రమంలో భాగంగా మహిళలకు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, వైద్య సేవలందించడంతోపాటు సంపూర్ణ ఆరోగ్యంపై అవగాహన కల్పించనున్నారు. ఇందుకోసం మూడు జిల్లాల్లో 15 రోజులపాటు మెగా హెల్త్ క్యాంపులు నిర్వహిస్తారు. రోజూ ఒక్కో జిల్లాలో పది మెగా ఆరోగ్య క్యాంపులు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. స్పెషలిస్టు వైద్యులతో క్యాంపుల్లో స్క్రీనింగ్ నిర్వహించనున్నారు. ఈ బృహత్తర కార్యక్రమం కింద మహిళలకు బీపీ, షుగర్, ఓరల్, బ్రెస్ట్, సర్వైకల్ కాన్సర్, క్షయ పరీక్షలతో పాటు రక్తహీనతకు గురికాకుండా ఉండేలా తీసుకోవాల్సిన

మిగతా 7వ పేజీలో...

సన్నాహక సమావేశాలు

ఈ నెల 17 నుంచి అక్టోబరు రెండో తేదీ వరకు నిర్వహిస్తున్న స్వాస్థ్ నారీ, స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికార యంత్రాంగం తగిన ఏర్పాట్లు చేస్తోంది. రంగారెడ్డి జిల్లా జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జిల్లా ప్రోగ్రామ్ అధికారులు, జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారులు మంగళవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ మెగా హెల్త్ క్యాంపులు కలెక్టర్ ఆదేశానుసారంగా ఇతర శాఖలు, వివిధ సంఘాల సమన్వయంతో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి రోజూ స్పెషలిస్టు వైద్యులచే పది మెగా క్యాంపులు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. రోజూ జిల్లాలోని నాలుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, నాలుగు ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు, ఒక సామాజిక ఆరోగ్య కేంద్రం, ఒక ప్రైవేటు ఆసుపత్రిలో ఈ మెగా క్యాంపుల నిర్వాహణ కోసం ఏర్పాట్లు చేస్తున్నామని, దీనికి అందరూ సహకరించాలని కోరారు. సమావేశంలో ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ విజయపూర్ణిమ, డాక్టర్ గీత, డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ నాగేంద్రబాబు, డాక్టర్ రాధిక, డాక్టర్ పూనమ్, డాక్టర్ రాకేష్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి

ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను అనుసరించాలి

» ఎస్పీ నారాయణరెడ్డి

దోమ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణను ఫ్రెండ్లీ పోలీస్ విధానాన్ని అనుసరించాలని ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం దోమ పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. నేరాలను తగ్గించడం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటూ పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలన్నారు. మండలంలో మేకల దొంగతనాలు జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. దొంగతనాల కేసులను ఛేదించడం కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా మెలగాలన్నారు. ఆయనతో పాటు డీఎస్పీ శ్రీనివాస్, ఎస్సై వసంత్ జాదవ్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

అదనపు ఎస్పీగా రాములు నాయక్

వికారాబాద్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా అదనపు ఎస్పీగా రాములు నాయక్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు నిర్మల్ జిల్లాలో పనిచేసిన రాములు నాయక్ ఎస్పీ నారాయణరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు.

యూరియా గోస

7

- ఉదయమే దుకాణాలకు పరుగులు తీస్తున్న రైతులు
- పలుచోట్ల ధర్నాలు, రాస్తారోకోలు
- తగినంత సరఫరాకు డిమాండ్

ట్రిపుల్‌ఆర్‌పై భగ్గు

అలైన్‌మెంట్ మార్పునకు డిమాండ్

- భూములు ఇచ్చేది లేదంటూ రైతుల నిరసన
- ఇటీవల హెచ్ఎండీఏ కార్యాలయం ముట్టడి
- అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేత
- కలెక్టరేట్ ఎదుట పూడూరు రైతుల ధర్నా
- పాత అలైన్‌మెంట్ అమలుకు డిమాండ్
- జిల్లాలో 22 గ్రామాల మీదుగా రోడ్డు నిర్మాణం

రీజినల్ రింగ్ రోడ్డు(ఆర్ఆర్ఆర్) అలైన్‌మెంట్‌పై అన్నదాతలు భగ్గుమంటున్నారు. ఈ రోడ్డు నిర్మాణానికి భూములు ఇచ్చేది లేదంటూ తేల్చిచెబుతున్నారు. జిల్లాలోని 22 గ్రామాల మీదుగా ఆర్ఆర్ఆర్‌ను ప్రతిపాదించారు. బీడు భూములు, అసైన్డ్ భూములు కాకుండా సాగు భూములు కోల్పోవాల్సి వస్తోందని రైతులు ఆందోళనకు గురవుతున్నారు. అలైన్‌మెంట్‌ను నిరసిస్తూ ఇటీవల నిర్వహించిన హెచ్ఎండీఏ కార్యాలయం ముట్టడి కార్యక్రమానికి జిల్లా నుంచి ప్రభావిత గ్రామాల నుంచి భారీగా వెళ్లిన రైతులు ఆందోళనకు దిగారు. అలాగే మంగళవారం కలెక్టరేట్ ఎదుట పూడూరు మండల బాధిత రైతులు నిరన వ్యక్తం చేసి అలైన్‌మెంట్ మార్చాల్సిందేనని డిమాండ్ చేశారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న పూడూరు మండల బాధిత రైతులు

వికారాబాద్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): హైదరాబాద్ చుట్టూ వంద మీటర్ల వెడల్పుతో ప్రతిపాదించిన రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణంలో కోల్పోనున్న భూముల వివరాలను గ్రామాలు, సర్వే నెంబర్ల వారీగా హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ ఇటీవల ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. డిజిటల్ రూట్ మ్యాప్‌ను కూడా రూపొందించిన హెచ్ఎండీఏ అధికారులు తమ పోర్టల్‌లో పొందుపరిచారు. ఎనిమిది జిల్లాల మీదుగా కొనసాగనున్న ట్రిపుల్ ఆర్ వికారాబాద్ జిల్లాలో నాలుగు మండలాల మీదుగా ప్రతిపాదించారు. గ్రామాల వారీగా రైతులు కోల్పోనున్న భూముల సర్వే నెంబర్లను ఈ నోటిఫికేషన్ అందుబాటులో ఉంచారు. తమ గ్రామాల మీదుగా ప్రతిపాదించిన రోడ్డు నిర్మాణంలో తమ భూములను కోల్పోనున్నామని తెలుసుకున్న రైతులు ఆందోళన చెందుతున్నారు. గ్రామాల వారీగా రైతులు హైదరాబాద్‌లోని హెచ్ఎండీఏ కార్యాలయానికి వెళ్లి ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ చేసిన విధానంపై రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లో తమ భూములను

మిగతా 8వ పేజీలో...

భూమి లేకుంటే బతికేదెలా



ఈ రైతు పేరు చాంద్‌పాషా. నవాబ్‌పేట మండలం, చిట్టిగిద్ద గ్రామం. ఈయనకు తల్లి, నలుగురు అన్నదమ్ములు ఉన్నారు. వీరి పేరిట సర్వే నంబరు 135లో 12.13 ఎకరాల రేగడి పొలం ఉంది. వారికి ఈ వ్యవసాయ భూమే జీవనాధారం. తమ పొలం ఉన్న సర్వే నంబరు మీదుగా ట్రిపుల్ ఆర్ కొత్త అలైన్‌మెంట్ ఉందని తెలిసినప్పటి నుంచి వారికి కంటి మీద కునుకు లేకుండా పోయింది. ఈ భూమి తమ భవిష్యత్తు అవసరాలకు ఆదుకుంటుందని కొండంత ఆశతో ఉండగా, ఇప్పుడు దాన్ని కోల్పోతున్నామని తెలిసి ఆందోళన చెందుతున్నారు. జీవనాధారమైన ఈ భూమిని ఇచ్చేది లేదని, ఈ భూమి లేకపోతే తమ బతుకులు ఆగమవుతాయని చాంద్‌పాషా కన్నీటి పర్యంతమయ్యాడు. ఎల్లకొండ మీదుగా ఇంతకు ముందున్న పాత అలైన్‌మెంట్‌నే కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు. వారికి బతుకునిచ్చే భూములను వదులుకునేందుకు తాము ఏమాత్రం సిద్ధంగా లేమని వాపోయారు.



ఎక్స్కవేటర్‌తో ఇల్లు కూల్చివేస్తున్న సిబ్బంది

ఆర్వోబీ నిర్మాణానికి ఇళ్ల కూల్చివేతలు

- ఎట్టకేలకు కొలిక్కివచ్చిన సమస్యలు
- వాహనాల రాకపోకలకు తొలగిన ఇక్కట్లు

ఘట్‌కేసర్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్‌లో రైల్వే బ్రిడ్జి నిర్మాణానికి అడ్డుగా ఉన్న పలు ఇళ్లను మంగళవారం కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో కూల్చివేశారు. రైల్వే వంతెన నిర్మాణ పనులు 15 సంవత్సరాలుగా కొనసాగుతున్న విషయం తెలిసిందే. బాలాజీ నగర్ వైపు వంతెన పనులు పూర్తయ్యాయి. కానీ ఇవతలి వైపున ఇళ్లు కోల్పోతున్న వారు తమకు సరిపడా పరిహారం ఇవ్వడం లేదని కోర్టును ఆశ్రయించారు. దీంతో రోడ్డు మధ్యలో నిర్మాణ పనులను చేపట్టారు. ఇళ్లు కూల్చకుండా పనులు చేయగా రెండేళ్లుగా ఘట్‌కేసర్ మీదుగా బస్సుల రాకపోకలు నిలిచాయి. ఎట్టకేలకు మంగళవారం కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వజ్రేశ్‌యాదవ్ ఆధ్వర్యంలో రెండు ఎక్స్‌కవేటర్లతో నిర్మాణాల కూల్చివేతలు చేపట్టారు. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తీరాయి ఈ సందర్భంగా వజ్రేశ్ యాదవ్ మాట్లాడుతూ.. ఘట్‌కేసర్‌లో 15సంవత్సరాలుగా నానుతున్న రైల్వే వంతెన నిర్మాణంలో సమస్యలన్నీ కొలిక్కొచ్చాయని చెప్పారు. ఆర్వోబీ నిర్మాణం పూర్తికాక ఏళ్ల తరబడి ప్రజలు రాకపోకలకు నిత్యం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ సమస్యపై స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ మాత్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు. తామే నిర్వాసితులతో మాట్లాడి వేయాల్సిన రోడ్డు కోసం ఇళ్లను కూల్చి వేయించామని చెప్పారు. ఇళ్లు కోల్పోయిన వారి సమస్యలను పరిష్కరించేందుకు మున్సిపల్ అధికారులకు సూచించామని తెలిపారు. కూల్చివేతకు సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ముల్లి పావని, నాయకులు మహేష్‌గౌడ్, ముత్యాలు, యాదగిరి, బి.ప్రభాకర్‌రెడ్డి, మశ్చేందర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, మల్లేశ్, ఖయ్యూం, ఆంజనేయులు, శ్రీనివాస్ పాల్గొన్నారు.



న్యూట్రీషియన్ పంపిణీ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో, ఆర్ఎంపీలు

టీబీ రోగుల ఆరోగ్యానికి తోడ్పడాలి

» డిప్యూటీ డీఎంహెచ్‌వో రవీంద్రనాయక్

బషీరాబాద్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): టీబీ రోగుల ఆరోగ్యాలను కాపాడే దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో రవీంద్రనాయక్ పిలుపునిచ్చారు. మంగళవారం తాండూరులోని జిల్లా ఆసుపత్రిలో టీబీ రోగులకు ఆర్ఎంపీ సంఘం ఆధ్వర్యంలో న్యూట్రిషన్ కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ టీబీ బారిన పడిన రోగులకు మందులతో పాటు పౌష్టికహారం ప్రధానమన్నారు. పేదలు ఆర్థిక స్థోమత లేక న్యూట్రిషన్ ఫుడ్ తీసుకునేందుకు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ఆర్ఎంపీ సంఘం ఆధ్వర్యంలో టీబీ రోగులకు న్యూట్రిషన్ కిట్లు అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంపీ అసోసియేషన్ అధ్యక్షులు పవన్, పాషా, బషీరాబాద్ మండలాధ్యక్షులు జయరాంచారి, ఉపాధ్యక్షులు నర్సింహులు, శ్యామ్‌కుమార్ సిందే, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

13న లోక్ అదాలత్

» తాండూరు రూరల్ సీఐ నగేశ్



తాండూరు రూరల్, సెప్టెంబరు 9, (ఆంధ్రజ్యోతి): పాత కేసులపై 13వ తేదీన తాండూరు మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టులో లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు తాండూరు రూరల్ సీఐ నగేశ్ తెలిపారు. లోక్ అదాలత్‌తో రాజీపడితే ఇద్దరి సమస్య పరిష్కారం అవుతుందని, ఇరు కుటుంబాల వారు సంతోషంగా ఉండొచ్చన్నారు. చిన్నచిన్న కేసుల్లో రాజీ మార్గమే రాజమార్గమని సూచించారు. బషీరాబాద్, యాలాల, పెద్దేముల్, కరన్‌కోట్ పోలీసు స్టేషన్‌లో దాదాపు 450 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిలో 280 కేసుల వరకు లోక్ అదాలత్‌తో పరిష్కరించేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. ఇరువర్గాల రాజీకోసం ఆసక్తిగల వారు లోక్ అదాలత్ కోసం పోలీసులను సంప్రదించాలన్నారు. ఆయనతో పాటు కరన్‌కోట్ ఎస్ఐ రాథోడ్ వినోద్ తదితరులున్నారు.

ఎరిమల్లెవాగు పరిశీలన

పొల్యూషన్‌బోర్డుకు నమూనాలు



వాగు వద్ద మత్స్యకారులతో మాట్లాడుతున్న అధికారులు

ఘట్‌కేసర్ సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): జవహర్‌నగర్ డంపింగ్ వ్యర్థాలు చెరువులో కలిసి చేపలు చనిపోతున్నాయని సోమవారం మత్స్యకారులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం జిల్లా ఇరిగేషన్ అధికారి సునీత, జిల్లా మత్స్యశాఖ అధికారి సుకీర్తి, తహసీల్దారు డీఎస్ రజిని, మున్సిపల్ కమిషనర్ పంజాల రాజేశ్ మత్స్యకారులతో కలిసి బొక్కొనిగూడ వద్ద ఎరిమల్లెవాగును సందర్శించారు. వాగుకు ఎగువభాగంలో నీటిశుద్ధి కేంద్రాలు ఏర్పాటు చేసి నీరు కలుషితం కాకుండ చూడాలని మత్స్యకారులు అధికారులను కోరారు. అనంతరం వాగులోని నీటి నమునాలు సేకరించి రాష్ట్ర కాలుష్య నివారణ మండలికి పంపించనున్నట్లు అధికారులు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ పరమేశ్, గంగపుత్రం సంఘం అధ్యక్షుడు పూస యాదగిరి, కార్యదర్శి పూస నర్సింగ్‌రావు, మత్స్యకారులు మెట్టు రమేశ్, పూస బాలయ్య, రమేశ్, సురేందర్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.



భోజనం వడ్డిస్తున్న తీరును పరిశీలిస్తున్న మాధవరెడ్డి

నాణ్యమైన విద్యనందించాలి

» జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి మాధవరెడ్డి

కొడంగల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు మెరుగైన విద్యను అందించేందుకు కృషి చేయాలని జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారులు మాధవరెడ్డి, భీమ్‌రాజ్ సూచించారు. మంగళవారం వారు కొడంగల్, దౌల్తాబాద్ బీసీ వసతి గృహాలను సందర్శించారు. అక్కడ విద్యార్థులకు అందించే భోజనం, వసతులపై వార్డెన్‌తో మాట్లాడి అడిగి తెలుసుకున్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. వారితో పాటు వార్డెన్ రాధిక తదితరులు ఉన్నారు.

ఉమ్మడి జిల్లా ఏఎంసీ చైర్మన్‌ల ఫోరం

గౌరవ అధ్యక్షుడిగా పెంటయ్యగౌడ్

చేవెళ్ల, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ల గౌరవ అధ్యక్షుడిగా చేవెళ్ల మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డమీది పెంటయ్యగౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం హైదరాబాద్‌లో జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీల చైర్మన్‌ల ఫోరం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఫోరం గౌరవాధ్యక్షుడిగా పెంటయ్యగౌడ్‌ను ఎన్నుకున్నారు. అలాగే ఉమ్మడి జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీల ఫోరం అధ్యక్షుడిగా మల్లేశ్(గుడిమల్కాపూర్ ఏఎంసీ చైర్మన్), ఉపాధ్యక్షుడిగా కె.వేణుగౌడ్(నార్సింగి ఏఎంసీ చైర్మన్), ప్రధాన కార్యదర్శిగా జి.మాధవ రెడ్డి (బషీరాబాద్ ఏఎంపీ చైర్మన్), సహాయ కార్యదర్శిగా బి.ఆంజనేయులు


రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కలిసిన పెంటయ్యగౌడ్, నూతన కార్యవర్గ సభ్యులు, నాయకులు

(కల్వకుర్తి మార్కెట్ చైర్మన్) ఎంపికయ్యారు. వారంతా రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును మర్యాదపూర్వకంగా కలిశారు. వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ అభివృద్ధికి కృషిచేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు మంత్రితో తెలిపారు.

ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డికి మంత్రి సన్మానం



బషీరాబాద్: ఉమ్మడి జిల్లా మార్కెట్ కమిటీల ఫోరం జనరల్ సెక్రటరీగా ఎన్నికైనా జి.మాధవరెడ్డి వ్యవసాయశాఖ మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి ఆయనను శాలువా కప్పి సన్మానించి శుభాకాంక్షాలు తెలిపారు. అలాగే మాధవరెడ్డికి తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, మండల కాంగ్రెస్ నాయకులు, మార్కెట్ కమిటీ సభ్యులు శుభాకాంక్షాలు తెలిపారు.

రోడ్డు పక్కన మురుగు శుభ్రం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


అవుశాపూర్ సర్వీసు రోడ్డులో మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, అవుశాపూర్ జాతీయ రహదారి సర్వీసు రోడ్డులో మ్యాన్‌హోల్ పగిలి ముగురు నీరు వరదలా ప్రవహించింది. మంగళవారం మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేయించి డ్రైనేజీ నీరు వెళ్లేలా చేశారు. ఆంధ్రజ్యోతిలో ఈ నెల 8న ప్రచురితమైన 'రోడ్డుపై వరదలా మురుగు' కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. కమిషనర్ రాజేష్ ఆదేశాల మేరకు సిబ్బంది వర్షాలకు పడిన గుంతలను పూడ్చి వాహనాల రాకపోకలు ఇబ్బంది లేకుండా చేశారు.









ఆయిల్‌పామ్ సాగు లాభదాయకం

● జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి సురేశ్


రైతులకు ఒప్పంద పత్రాలను అందజేస్తున్న సురేశ్

తలకొండపల్లి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ సాగు రైతులకు అన్ని విధాలా లాభదాయకమని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి సురేశ్ అన్నారు. ఉద్యానవన, ఆరు తడి పంటలపై రైతులు దృష్టి సారించాలని సూచించారు. తలకొండపల్లి రైతు వేదికలో మంగళవారం ఆయిల్ పామ్ సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. షాద్‌నగర్ డివిజన్ హార్టికల్చర్ అధికారి హిమబిందు అధ్యక్షతన జరిగిన సదస్సుకు సురేశ్, ఏడీహెచ్ కిషన్ హాజరయ్యారు. ఆయిల్ పామ్ సాగు, ప్రభుత్వ ప్రోత్సాహం, దిగుబడి, మార్కెటింగ్ విధానాలపై రైతులకు అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయిల్ పామ్ సాగు చేసిన రైతులతో వాల్యూ ఆయిల్ కంపెనీ కొనుగోలు ఒప్పందం చేసుకుంది. అధికారి సురేశ్ మాట్లాడుతూ.. ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం సబ్సిడీలతో తోడ్పాటునందిస్తోందని చెప్పారు. మండలంలో ఇప్పటి వరకు 332ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేశారని తెలిపారు. రైతులకు అధిక ఆదాయాన్నిచ్చే ఆయిల్ పామ్ మొక్కలకు 90శాతం, డ్రిప్‌కు 80నుంచి 100శాతం రాయితీ, మొక్కలు నాటిన నాలుగేళ్ల వరకు ప్రతీ ఎకరానికి ఏటా రూ.4,200 చొప్పున నిర్వహణ ఖర్చులు ప్రభుత్వం ఇస్తుందని సురేశ్ వివరించారు. పంట చేతికొచ్చిన తరువాత ఎకరానికి 8 నుంచి 10టన్నులు దిగుబడొస్తుందన్నారు. ప్రస్తుతం టన్నుకు రూ.19,107 ధర ఉందన్నారు. కార్యక్రమంలో ఆయిల్ వాల్యూ కంపెనీ ఉపాధ్యక్షుడు రామ్మోహన్‌రావు, ఏరియా మేనేజర్ ప్రమోద్ కుమార్, హెచ్ఈవో సీతారాం, ఫీల్డ్ ఆఫీసర్ కొండల్‌రెడ్డి, రైతుల పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమమే టీయూడబ్ల్యూజే ధ్యేయం


విలేకరులకు సభ్యత్వ నమోదు పత్రాలను అందజేస్తున్న బాల్‌రాజ్

శామీర్‌పేట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ జిల్లాలో జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్(టీయూడబ్ల్యూజే) నిరంతరం పోరాటం చేస్తుందని యూనియన్ జిల్లా అధ్యక్షుడు బాల్‌రాజ్, ప్రధాన కార్యదర్శి వెంకట్‌రాం రెడ్డి అన్నారు. మంగళవారం శామీర్‌పేట ప్రెస్‌క్లబ్‌లో క్లబ్ అధ్యక్షుడు క్యాతం రవి అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి బాల్‌రాజ్ వచ్చి మెంబర్‌షిప్‌లను అందజేశారు. అనంతరం బాల్‌రాజ్ మాట్లాడుతూ.. సభ్యత్వ నమోదు చేసుకున్న వారికి ఐడీ కార్డు, జిల్లా డైరీ, భావస్వేచ్ఛ మాస పత్రికలను అందజేస్తామని తెలిపారు. అర్హులైన విలేకరులందరికీ అక్రిడిటేషన్లు, విలేకరుల కుటుంబాలకు ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. శామీర్‌పేట ప్రెస్‌క్లబ్‌ను బాగా నడుపుతున్నారని, జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి రవి పాటుపడుతున్నారని ప్రశంసించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా సంయుక్త కార్యదర్శి వాసాల మర్రి నర్సింహారావు, కార్యవర్గ సభ్యులు వెంకట్‌రెడ్డి, నాయకుడు దేశం కృష్ణ, మాజీ అధ్యక్షుడు భూపాల్, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌యాదవ్, ఉపాధ్యక్షులు శేఖర్, పవన్ కుమార్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

చేవెళ్ల కోర్టులో మాట్లాడుతున్న రిటైర్డ్ జడ్జి సాంబశివరావు


సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ ప్రమాదకరం

చేవెళ్ల, సెప్టెంబరు9(ఆంధ్రజ్యోతి):సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలను డ్రైవ్ చేయడం ప్రమాదకరమని రిటైర్డ్ జడ్జి సాంబశివరావు అన్నారు. మంగళవారం చేవెళ్ల కోర్టు ఆవరణలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో ఆయన మాట్లాడారు. మద్యం తాగి వాహనాలు నడపడం నేరం అని, అది ప్రమాదకరం అన్నారు. డ్రంకెన్ డ్రైవ్ కింద 58 కేసులకు గాను రూ.73,500 జరిమానా విధించామని తెలిపారు. లోక్ అదాలత్ ఈ నెల 13వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ ఎస్.వెంకటేశం, ఎస్సై చందర్‌నాయక్, కోర్టు అధికారులు, ట్రాఫిక్ పోలీసులు తదితరులు ఉన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


ఆర్డీవో కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న నాయకులు

చేవెళ్ల, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి):వ్యవసాయ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎం.ప్రభులింగం, జిల్లా అధ్యక్షుడు అంజయ్య తెలిపారు. రాష్ట్ర, జిల్లా కమిటీ పిలుపు మేరకు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం చేవెళ్ల ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి అధికారులకు వినతిప్రతమిచ్చారు. వారు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని ఆరోపించారు. పేదలకు ఇండ్లు, పెన్షన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ కూలీలకు రేటుపెంచి 200రోజుల పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి సత్తిరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పెంటయ్య, చంద్రమౌళి, స్వరూప, వెంకటమ్మ, పెంటమ్మ పాల్గొన్నారు.

చెరువు తూమును తెరవాలి


తహసీల్దార్ వెంకటేశ్‌ప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

పెద్దేముల్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): చెరవు తూము తీయకుండా చేయడంతో పొలాల్లో నిలుస్తోందని, దీంతో తాము పంటలు సాగుచేసుకోలేకపోతున్నామని రైతులు అధికారికి విన్నవించుకున్నారు. మారెపల్లి రైతులు మంగళవారం తహసీల్దార్ వెంకటేశ్‌ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. మారెపల్లి, మారెపల్లి తండా శివారులో బషీర్‌పాట కుంట ఉంది. కొందరు చెరువులో చేపల పెంపకం చేపట్టి నీరు బయటకు పోకుండా తూమును మూసేశారని రైతులు వాపోయారు. ఆ చెరువుకు వెనక వైపు ఉన్న తమ పొలాల్లో బ్యాక్ వాటర్ నిలుస్తోందని తెలిపారు. దీంతో తాము పంటలు సాగుచేసుకోలేకపోతున్నామన్నారు. బషీర్ పాటకుంటలో కొందరు చేపలు పెంపకానికి అలవాటుపడి తూము తీయనీయడం లేదని, తూము తీసేందుకు వెళ్తే తమపై దౌర్జన్యం చేస్తున్నారని రైతులు చెప్పారు. నాలుగైదేళ్లుగా పదిమంది రైతులకు సంబంధించిన 15ఎకరాలు బీడుగా ఉంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు తూమును తెరిపించాలని కోరారు.

ట్రిపుల్ ఆర్‌ను పాత అలైన్మెంట్‌తోనే నిర్మించాలి

పూడూరు, సెప్టెంబర్ 9(ఆంధ్రజ్యోతి): ట్రిపుల్ ఆర్‌ను పాత విధానంలోనే తీసుకెళ్లాలని పూడూరు మండల బీజేపీ మాజీ అధ్యక్షుడు జాజుల అనిల్ అన్నారు. పూడూరుకు చెందిన ట్రిపుల్ ఆర్ బాధితులు హెచ్ఎండీఏ, కలెక్టరేట్‌లో అభ్యంతరం తెలిపారని అన్నారు. రాకంచర్లలో పదేళ్ల ముందు 150ఎకరాలు ఇండస్ట్రియల్ కారిడార్‌కు తీసుకున్నారని, ఇప్పుడు ట్రిపుల్ ఆర్‌కు మళ్లీ భూములు తీసుకుంటున్నారని వాపోయారు. రాకంచర్లలో పేద రైతులు భూములు కోల్పోతే వారి కుటుంబాలు ఏం కావాలంటే అనిల్ ప్రశ్నించారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే స్పందించి ట్రిపుల్ ఆర్‌ను పాత రూట్లోనే తీసుకెళ్లాలని, లేకపోతే పెద్దఎత్తున నిరసన దీక్షలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

● షాద్‌నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ


పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఏసీపీ లక్ష్మీనారాయణ

కొందుర్గు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): పోలీసులు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని ఏసీపీ లక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం కొందుర్గు పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించారు. అనంతరం క్రైం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదుల కోసం పోలీస్‌స్టేషన్ వచ్చే వారితో వెంటనే స్పందించాలన్నారు. ఫిర్యాదులను ఎప్పటిప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో రూరల్ సీఐ నరసయ్య, ఎస్సైలు రవీందర్‌నాయక్, బాలస్వామి, హెచ్‌సీ శ్రీనయ్య పాల్గొన్నారు.

12 నుంచి ఏఐపై

రెండు రోజుల జాతీయ సదస్సు


డాక్టర్ నీతా పోలె

షాద్‌నగర్ రూరల్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): తెలంగాణ గిరిజన గురుకుల డిగ్రీ, పీజీ కాలేజీలు, ఉన్నత విద్యా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో కృతిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)పై రెండు రోజుల జాతీయ సదస్సు నిర్వహిస్తామని షాద్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నీతా పోలె తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ.. సెప్టెంబరు 12, 13వ తేదీల్లో షాద్‌నగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సదస్సు జరుగుతుందన్నారు. సదస్సులో ప్రత్యక్ష, పరోక్ష పద్ధతిలో సెమినార్లు నిర్వహిస్తామని తెలిపారు. సదస్సులో పత్ర సమర్పణ చేసే వారికి సర్టిఫికెట్లు ఇస్తామన్నారు. సదస్సుకు ఇప్పటి వరకు తెలంగాణతో పాటు ఐదు రాష్ట్రాల నుంచి ఆర్టికల్స్ ప్రజెంటేషన్స్‌కు రానున్నారని తెలిపారు. ఉత్తమ ప్రజెంటేషన్‌కు బహుమతులు అందజేస్తామని చెప్పారు. వివరాలకు 9703441345, 0705967553 నంబర్లలో సంప్రదించాలన్నారు.

వృథాగా మిషన్ భగీరథ నీరు

● పట్టించుకోని అధికారులు


ఎంకిర్యాలలో వృథాగా పోతున్న తాగునీరు

కొందుర్గు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మిషన్ భగీరథ పైపులైన్ పగిలి నీరు వృథా అవుతోంది. కొందుర్గు మండలం ఎంకిర్యాల శివారు వాగు వద్ద ఉన్న మిషన్ భగీరథ పైపులైన్ పగిలి మంగళవారం నీరు వృథాగా పోయింది. నాలుగు రోజులుగా గ్రామాలకు మిషన్ భగీరథ నీరు రావడం లేదని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు తెలిపారు. అధికారులు స్పందించి వృథా అవుతున్న మిషన్ భగీరథ పైపులైన్‌కు వెంటనే మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

కళ్లకు గంతలతో గణిత అవధానం

ధారూరు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): నాగసమందర్ జెడ్పీ పాఠశాలలో మంగళవారం రాష్ట్రపతి అవార్డీ, రిటైర్డ్ హెచ్‌ఎం అనంతప్పయాదవ్ కళ్లకు గంతలతో గణిత అవధానాన్ని నిర్వహించారు. ఆయన ప్రదర్శన ఉపాధ్యాయులు, విద్యార్థులను అబ్బురపరిచింది. శతావధానంలో భాగంగా విద్యార్థులు బోర్డుపై ఒకటి నుంచి వంద వరకు రాసిన పదాలను కళ్లకు గంతలు కట్టుకొని చెప్పారు. పదాలను ఆరోహణ, అవరోహణ క్రమంలో టకాటక్ చెప్పారు. మాయ కూడిక, మాయ చదరం, తేదీ చెబితే వారం చెప్పడం తదితర అంశాలను ఆయన విద్యార్థులకు నేర్పారు. విద్యార్థులు జ్ఞాపకశక్తి, ఏకాగ్రత పెంచుకునేందుకు సూచనలు చేశారు. అనంతరం ఆయనను పాఠశాల టీచర్లు సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.రమేశ్, జిల్లా సైన్సు అధికారి విశ్వేశ్వర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నాగసమందర్ పాఠశాలలో గణిత అవధానం నిర్వహిస్తున్న అనంతప్ప



మేడికొండలోని వ్యవసాయ క్షేత్రంలో అధికారులు, శాస్త్రవేత్తలు

పొలాలను సందర్శించిన శాస్త్రవేత్తలు

పూడూరు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని మేడికొండలో పంట పొలాలను జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు, రైతు విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు సందర్శించారు. మంగళవారం సెంటర్ కో-ఆర్డినేటర్ డాక్టర్ టి.రాజేశ్వర్‌రెడ్డి, శాస్త్రవేత్త మధు, ఏడీఏ రాజరత్నం, ఉద్యాన అధికారి సత్తార్ వ్యవసాయ క్షేత్రాల్లో పంటలను పరిశీలించారు. చామంతికి అల్టర్నెయా ఆకుపచ్చ తెగులు సోకిందని గుర్తించారు. క్లోరోథలోనిల్ 2గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలని, లేదా మెటీరం,పైరాక్లోస్ట్రోబిన్ 2గ్రాములు పిచికారి చేయాలని శాస్త్రవేత్తలు సూచించారు. పత్తి పంటలో తామర పురుగు, తెల్లదోమ నివారణకు ఫ్లోనికామిడ్ 0.3గ్రాములు లీటరు నీటిలో, లేదా డయాఫెంథియొరాన్ 1.24గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలని సూచించారు. వర్షాలతో దెబ్బతిన్న పంటకు పోషకాహార భర్తీగా 13:0:45 10గ్రాములు ప్రతి లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. అనంతరం పొలాలను సందర్శించారు. కార్యక్రమంలో పరిగి ఏడీఏ లక్ష్మీకుమారి, ఏవో తులసీరాం, మండల ఉద్యాన అధికారి సురేంద్రనాథ్, ఏఈవో ఇలియాస్, రైతులు అనంతరెడ్డి, యాదయ్య, రాంరెడ్డి, నర్సింహులు, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉప రాష్ట్రపతిగా ఎన్నికైన రాధాకృష్ణన్‌కు శుభాకాంక్షలు

మొయినాబాద్ రూరల్, సెప్టెంబరు 9(ఆంధ్యజ్యోతి): భారతదేశ 15వ ఉప రాష్ట్రపతిగా చంద్రాపురం పొన్నుస్వామి రాధాకృష్ణన్ గెలుపొందిన సందర్భంగా చిలుకూరు బాలాజీ ఆలయం తరఫున ఆలయ ప్రధానార్చకులు సీఎస్.రంగరాజన్ శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. గతేడాది తెలంగాణ ఇన్‌చార్జి గవర్నర్ హోదాలో చిలుకూరు బాలాజీని దర్శించుకున్న ఆయన వేంకటేశ్వర స్వామి ఆశీస్సులతో ఉపరాష్ట్రపతిగా ఎన్నికయ్యారని అన్నారు. రాజ్యాంగాన్ని గౌరవిస్తూ, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేలా పనిచేయాలని ఆకాంక్షించారు. గతంలో చిలుకూరుకు వచ్చిన రాధాకృష్ణన్‌తో కలిసి దిగిన ఫొటోను ఈ సందర్భంగా రంగరాజన్ చూపారు.



సీపీ రాధాకృష్ణన్‌కు పుస్తకాన్ని అందజేస్తున్న ఆలయ అర్చకుడు రంగరాజన్(ఫైల్)



ఉదయ్‌పూర్‌లో తెలంగాణ ఉపాధ్యాయుల ప్రదర్శన

ఉదయ్‌పూర్‌లో తెలంగాణ సాంస్కృతిక ప్రదర్శనలు

మోమిన్‌పేట్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఎన్కతల పాఠశాల ఉపాధ్యాయుడు రమేశ్, మరో 9 మంది ఉపాధ్యాయులు రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో తెలంగాణ సంస్కృతి, సంప్రాదాయాలు, పండగలు తదితర అంశాలపై నిర్వహించిన ప్రదర్శనలో పాల్గొన్నారు. ఆగస్టు 27 నుంచి ఈ నెల 10 వరకు విద్యాబోధనలు, సాంస్కృతిక సంప్రాదాయాలు, తెలంగాణ వనరులపై వర్క్ షాప్ నిర్వహించారని టీచర్ రమేశ్ తెలిపారు. ఈ జాతీయ స్థాయి వర్క్ షాప్‌లో తెలంగాణ తరఫున ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి తనతో పాటు మరో 9మంది పాల్గొన్నామని అక్కడి నుంచి సమాచారమిచ్చారు. ఎన్ఈపీ-2020లో భాగంగా విద్యలో తోలుబొమ్మలాట పాత్రపై 15రోజుల వర్క్‌షాప్ నిర్వహించారని, తెలంగాణ, కేరళ, ఏపీ, అరుణాచల్‌ప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, పశ్చిమబెంగాల్, రాజస్థాన్ తదితర 13రాష్ట్రాల నుంచి 90మంది ఉపాధ్యాయులు పాల్గొన్నట్టు చెప్పారు. ఇలాంటి వర్క్‌షాపులతో విద్యార్థులు, ఉపాధ్యాయుల్లో ఐక్యత భావం పెంపొందుతుందన్నారు. తెలంగాణ తరఫున కథలు, కళలు, నృత్యం, బుర్రకథ, హరికథ, లంబాడాల చరిత్ర, హస్తకళలు, తెలుగు పాటలు తదితరాంశాలపై ప్రదర్శలిచ్చి ప్రశంసలందుకున్నామని వివరించారు.

ఫార్చ్యూన్ హోమ్స్ లే అవుట్‌పై విచారణ

» జాతీయ ఎస్టీ కమిషన్ ఎదుట హాజరైన ఆర్డీవో, ఏసీపీ

కందుకూరు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముచ్చర్ల రెవెన్యూలో 50సర్వే నంబరులో వంద ఎకరాల్లో ఏర్పాటు చేసిన ఫార్చ్యూన్ హోమ్స్ వెంచర్‌లో జరిగిన అవకతవకలపై మంగళవారం ఢిల్లీలోని షెడ్యూలు తెగల జాతీయ కమిషన్ వద్ద విచారణ జరిగింది. ఈ విచారణకు ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు, కమిషన్ సభ్యుడు హుస్సేన్‌లు హాజరయ్యారు. ఆర్డీవో మాట్లాడుతూ.. రోసిరెడ్డి అనే వ్యక్తి ఫార్చ్యూన్ హోమ్స్ వెంచర్ పేరిట ప్లాట్లు అమ్ముతానని ఎస్టీ ప్రజల నుంచి డబ్బులు తీసుకొని రిజిస్ట్రేషన్ చేయకుండా వేధిస్తున్నాడని బాధితులు ఎస్టీ కమిషన్ ఎదుట వాపోయారని తెలిపారు. దేవిలాల్, పాండు అనే వ్యక్తులు మధ్యవర్తులుగా ఎన్ఎఫ్‌సీ కంపెనీలో పనిచేస్తూ డబ్బులు వసూలు చేసి రోసిరెడ్డితో ప్లాట్ల సేల్ అగ్రిమెంట్ చేసి రిజిస్ట్రేషన్ చేయకుండా తప్పించుకు తిరుగుతున్నారని కమిషన్‌కు చేశారన్నారు. గిరిజనులను మోసగించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కమిషన్ పోలీసు అధికారులను ఆదేశించినట్లు ఆర్డీవో తెలిపారు. ఈ కేసులో ఇప్పటికే ఐదుగురిపై కేసు నమోదైందని ఏసీపీ, కమిషన్ సభ్యుడు హుస్సేన్ చెప్పారు. ముచ్చర్లలోని 50 సర్వే నంబర్‌లో 100ఎకరాల్లో లేఅవుట్ వేశారని, ఇందులో రిజిస్ట్రేషన్లు కూడా జరిగాయని, బాధితుల నుంచి రోసిరెడ్డి డబ్బులు తీసుకొని సేల్ అగ్రిమెంట్ చేసుకొని రిజిస్ట్రేషన్లు చేయలేదని నివేదిక ఇచ్చినట్లు ఆర్డీవో తెలిపారు. ఈ కేసుకు సంబంధించి మరోసారి కమిషన్‌కు నివేదిక ఇవ్వాలని కమిషన్ సభ్యులను ఆదేశించినట్లు వివరించారు.



ఢిల్లీలో జరిగిన విచారణలో పాల్గొన్న ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, ఏసీపీ

అతివా.. ఆరోగ్యమస్తు

(ఐదో పేజీ తరువాయి)

జాగ్రత్తలు సూచిస్తారు. మహిళా శిశు సంక్షేమశాఖ ఏటా నిర్వహించే పోషణ్ మాసం కార్యక్రమాన్ని కలుపుకొని దీన్ని చేపట్టనున్నారు. ఈ హెల్త్ క్యాంపులను ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీతోపాటు నగరాలు, గ్రామాల్లోని యువజన సంఘాలు, స్వయం సహాయక సంఘాలు, మహిళా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రముఖుల సమన్వయంతో నిర్వహించడానికి ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం సూచించింది. ఈ క్యాంపుల్లో రక్తదాన శిబిరాలు నిర్వహిస్తారు.

అన్ని రకాల స్ర్కీనింగ్‌లు

ఈ కార్యక్రమంలో భాగంగా ఈనెల 17వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు నిర్వహించే మెగా హెల్త్ క్యాంపులను స్పెషలిస్టు వైద్యులచే నిర్వహిస్తారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు, సామాజిక ఆరోగ్య కేంద్రం, ప్రైవేటు ఆసుపత్రుల్లో ఈ కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు, హెల్త్ క్యాంపుల్లో మహిళల ఆరోగ్య పరిరక్షణకు సంబంధించి అన్ని రకాల వైద్యసేవలు అందిస్తారు. మహిళా ఆరోగ్య సంరక్షణ, మాతృ, శిశు సంరక్షణ స్ర్కీనింగ్ చేపడతారు. మహిళలకు, యుక్త వయసు బాలికలకు రుతు సంబంధిత సమస్యలు, పోషకాహార అవగాహన కల్పిస్తారు. టీబీ ముక్త అభియాన్ కార్యక్రమం కింద మహిళలకు టీబీ స్ర్కీనింగ్, చికిత్స అందిస్తారు. అలాగే ఇతర ఆరోగ్య సమస్యల పరిష్కారం కోసం హెల్త్ క్యాంపుల్లో తగిన ఏర్పాట్లు చేస్తున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు

ఎయిర్‌పోర్టు రోడ్డులో రెండు కార్లు ఢీ

» నడి రోడ్డుపై బోల్తా.. భారీగా ట్రాఫిక్ జామ్



శంషాబాద్ రూరల్, సెప్టెంబరు9(ఆంధ్రజ్యోతి):శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ప్రధాన రోడ్డులో మంగళవారం రెండు ఢీకొన్నాయి. ఆర్జీఐఏ ఔట్‌పోస్టు స్టేషన్ సీఐ బాల్‌రాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. కూకట్‌పల్లికి చెందిన లక్ష్మణ్ తన కారులో ఎయిర్‌పోర్టులో ప్రయాణికులను ఎక్కించుకొని హైదరాబాద్ వెళ్తుండగా ఎయిర్‌పోర్టు రోడ్డు ఆర్జీబీ యూ టర్న్ వద్ద అదే రూట్‌లో వచ్చిన మహారాష్ట్ర కారు(ఎంహెచ్‌ఓ1 ఈఈ7560) ఢీకొంది. దీంతో రెండు కార్లు రోడ్డుపై బోల్తా పడ్డాయి. రోడ్డుపై భారీగా ట్రాఫిక్ జామైంది. ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. ట్రాఫిక్ పోలీసులు రెండు కార్లను క్రేన్‌తో పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ఈ ప్రమాదంలో ప్రయాణికులకు స్వల్ప గాయలయ్యాయి. మహారాష్ట్ర కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

యూరియా గోస

» ఉదయమే దుకాణాలకు పరుగు తీస్తున్న రైతులు
» పలు చోట్ల ధర్నాలు, రాస్తా రోకోలు
» తగినంత యూరియా సరఫరాకు డిమాండ్



దోమలో బారులు తీరిన రైతులు



ఆమనగల్లు ఆగ్రోస్ కేంద్రం వద్ద రైతుల బారులు

ఆమనగల్లు/యాలాల/కొడంగల్ రూరల్/దోమ/చౌదరిగూడ, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): రైతులకు గత 20రోజులుగా యూరియా వెతలు తప్పడం లేదు. మొన్నటి దాకా వర్షాలు కురిసి ప్రస్తుతం సాధారణ పరిస్థితులు నెలకొన్న తరుణంలో అన్ని రకాల పంటలకు యూరియా వేసే తరుణం వచ్చింది. నిజానికి వర్షాలు నిలిచిన వెంటనే పంటలకు యూరియా వేయాల్సి ఉంది. కానీ కొరత కారణంగా నత్రజని లభించక నేటికీ పంటలకు యూరియా చల్లలేదు. సకాలంలో ఎరువు అందక పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం పడే ఆస్కారం ఏర్పడింది. రోజుల తరబడి యూరయా కొరతతో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో రైతులు ధర్నాలు, రాస్తారోకోలు చేస్తున్నారు. ఉదయం నుంచే దుకాణాల వద్ద లైన్లు కడుతున్నారు. అయినా యూరియా దొరకని పరిస్థితి ఉంది. వచ్చిన లోడ్లు గంటలోపే అయిపోతున్నాయి. ఒక్కో రైతుకు రెండుకు మించి బస్తాలు ఇవ్వడం లేదు. అదీ అందరికీ దక్కడం లేదు. ఇప్పటికైనా పంటలకు సరిపడా యూరియా తెప్పించాలని రైతులు కోరుతున్నారు. మంగళవారం రైతులు యూరియా కోసం ఇక్కట్లు పడ్డారు. ఆమనగల్లులో ఆగ్రో కేంద్రం వద్దకు రైతులు తరలివచ్చారు. ఎస్ఐ వెంకటేశ్ సిబ్బందితో చేరుకొని రైతులను వరుసక్రమంలో నిలుచొబెట్టి స్టాక్ ఉన్నంత వరకు పంపిణీ చేశారు. ప్రతి రైతుకు రెండు చొప్పున యూరియా బస్తాలిచ్చారు. కడ్తాల మండలం రావిచెడ్‌లో 220 బస్తాలు యూరియా రావడంతో రైతులు క్యూకట్టి తీసుకున్నారు. చాలా మంది చివరి రైతులకు యూరియా అందనేలేదు. యాలాల మండల రైతులు ఆందోళన చేశారు. తాండూరు-కొడంగల్ జాతీయ రహదారిపై లక్ష్మీనారాయణపూర్ చౌరస్తా వద్ద బైఠాయించారు. దీంతో ట్రాఫిక్ జామైంది. రైతులకు బీఆర్ఎస్ మండల నాయకులు మద్దతు తెలిపారు. యూరియా ఇవ్వలేని ఎమ్మెల్యేలు, మంత్రులు రాజీనామా చేయాలని నినాదాలు చేశారు. యూరియా వేయకుంటే పంటలుపండే పరిస్థితి లేదని రైతులన్నారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు రాములు మాట్లాడుతూ... ప్రభుత్వం రైతులకు యూరియా సరఫరాపై నిర్లక్ష్యం చేస్తుందన్నారు. తాండూరు రూరల్ సీఐ నగేశ్, ఎస్ఐ విఠల్‌రెడ్డి చేరుకొని రైతులతో మాట్లాడి ధర్నా విరమింపజేశారు. కొడంగల్‌లో మన గ్రోమోర్ సెంటర్ వద్ద లైన్లో నిల్చొని యూరియా బస్తాలు తీసుకున్నారు. స్టాక్ అయిపోయి చివరి రైతులకు అందలేదు. ఉస్సూరుమంటు ఇంటిబాట పట్టారు. దోమలోని ఆగ్రోస్ సెంటర్ వద్ద రైతులు బారులుతీరారు. ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున ఇచ్చారు. స్టాక్ అయిపోవడంతో చాలా మంది రైతులు ఉట్టి చేతుల్తో ఇళ్లకు వెళ్లారు. బషీరాబాద్(నవాంద్గీ) సొసైటీకి యూరియా లోడ్ రాగా సగం బస్తాలను దింపి లారీ తిరిగి వెళ్తుండగా రైతులు అడ్డుకున్నారు. మొత్తం బస్తాలు అక్కడే దింపాలని పట్టుబట్టారు. సమాచారం అందుకున్న ఎస్సై నుమన్‌అలీ సిబ్బందితో చేరుకున్నారు. సముదాయించే ప్రయత్నంలో రైతులు, పోలీసులు తోసుకున్నారు. స్టాక్ గురించి సొసైటీ అధికారులను అడుగుదామని ఎస్సై చెప్పగా రైతులు సొసైటీ వద్దకు చేరుకున్నారు. అక్కడా ఆందోళనకు దిగడంతో సొసైటీ వైస్‌చైర్మన్ అజయ్‌ప్రసాద్ రైతులకు నచ్చజెప్పారు. యూరియా ఇబ్బందులపై ఆయన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి ఫోన్‌చేసి చెప్పారు. సాయంత్రానికి మరో లోడ్ వస్తుందని తెలపడంతో రైతులు శాంతించి వెళ్లిపోయారు. జిల్లేడ్ చౌదరిగూడ, ఎదిర రైతు వేదికలో రైతులకు యూరియా అందజేశారు. అందని వారికి టోకేన్లు ఇచ్చారు. కార్యక్రమంలో ఏవో రాజేందర్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ దామోదర్‌రెడ్డి, సీఈవో మహమూద్, ఏఈవోలు స్వాతి, గౌరిప్రియ, సోనిశ్రీ పాల్గొన్నారు.



లక్ష్మీనారాయణపూర్ చౌరస్తా వద్ద బైఠాయించిన రైతులు



బషీరాబాద్‌లో యూరియా లారీని అడ్డుకుంటున్న రైతులు



నవాంద్గీ సొసైటీ వద్ద రైతులతో మాట్లాడుతున్న వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్

కరెంటు కోతలపై రోడ్డెక్కిన రైతులు

పరిగి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయానికి కరెంటు సరఫరాలో కోతలపై రైతులు రోడ్డెక్కారు. మంగళవారం వికారాబాద్ జిల్లా పరిగి మండలం రంగంపల్లి గేట్ దగ్గర రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. విద్యుత్ అధికారులు, సీఎంకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వారం రోజులుగా విద్యుత్ సరఫరాలో కోతలు విధిస్తున్నారని, ఇస్తున్న కొన్ని గంటలు కూడా రాత్రి పూట ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రంగంపల్లి సబ్‌స్టేషన్ నుంచి ప్రత్యేక ఫీడర్ ద్వారా పరిశ్రమలకు కరెంటు సరఫరా చేయడం ఏమిటని వారు ప్రశ్నించారు. కరెంటు సరఫరాలో ఇబ్బందులతో వరి పొలాలకు నీరందించలేదని పరిస్థితులు ఏర్పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయానికి రాత్రిపూట కాకుండా పగలే విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. సమస్యను విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళితే నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని వారు చెప్పారు.



రంగంపల్లి గేట్ దగ్గర రోడ్డుపై ధర్నా చేస్తున్న రైతులు

ఉపాధ్యాయులు.. సమాజ నిర్మాతలు

మేడ్చల్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): శ్రేయో సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం అని ఎమ్మెల్సీ ఏవీఎన్.రెడ్డి అన్నారు. మంగళవారం మేడ్చల్-మల్కాజ్గిరి కలెక్టరేట్ కార్యాలయంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించి టీచర్ల సన్మానించారు. ముఖ్య అతిథులుగా వచ్చిన ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైందన్నారు. సమాజ శ్రేయస్సుకు పాటుపడుతున్న ఘనత ఉపాధ్యాయులకు దక్కుతుందన్నారు. అదనపు కలెక్టర్ రాధికగుప్తా మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తు ఉపాధ్యాయుల చేతిలో ఉంటుందన్నారు. విద్యార్థులు ఉన్నతస్థాయికి చేరాలంటే దానికి ఉపాధ్యాయుల కృషిఎంతో ఉంటుందన్నారు. పదో తరగతిలో విద్యార్థులు అత్యధిక సంఖ్యలో ఉత్తీర్ణులయ్యేలా టీచర్లు బోధించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సకల సౌకర్యాలు కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. స్కూళ్లలో ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తెస్తే వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, హెచ్ఎంలు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి, అదనపు కలెక్టర్ రాధికగుప్తా



అంగన్‌వాడీ కేంద్రంలో ఆట వస్తువులను పరిశీలిస్తున్న కలెక్టర్ మను చౌదరి

సురక్షితమైన పౌష్టికాహారాన్ని అందించాలి

» ఎప్పటికప్పుడు ఎక్స్‌పైరీ తేదీని పరిశీలించాలి
» మేడ్చల్ కలెక్టర్ మను చౌదరి
» ఉప్పర్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రంలో ఆకస్మికంగా పరిశీలన

శామీర్‌పేట, సెప్టెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ చిన్నారులు, గర్భిణులకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని సురక్షితంగా ఉంచాలని కలెక్టర్ మను చౌదరి సూచించారు. అలాగే టీచర్, సిబ్బంది ఎప్పటికప్పుడు ఎక్స్‌పైరీ డేట్‌ను పరిశీలించి తగు జాగ్రత్తలను తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం తూంకుంట మున్సిపల్ పరిధిలోని ఉప్పర్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన అదనపు కలెక్టర్ రాధికాగుప్తాతో కలిసి తనిఖీ చేశారు. చిన్నారులకు, గర్భిణులకు ఇచ్చే పౌష్టికాహారం ఎక్స్‌పైరీ తేదీని జాగ్రత్తగా చెక్ చేసి ఇవ్వాలన్నారు. బాలమృతం అదనంగా ఉంటే సమీప అంగన్‌వాడీ కేంద్రాలకు ఇవ్వాలని ఐసీడీఎస్ అధికారికి సూచించారు. అలాగే అక్కడ వంటగది, వంట సామగ్రిని పరిశీలించారు. అనంతరం కేంద్రం ఆవరణలో చిన్నారులు ఆడుకునే ఆట వస్తువులను పరిశీలించి ఎంతో బాగున్నాయన్నారు. కేంద్రం ఆవరణలో ఎండ తగలకుండా పైన షెడ్డు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం చిన్నారులతో కాసేపు ముచ్చటించారు. ఆ చిన్నారులు చదువుతూ వినిపించే ఆటలు, పాటలను కలెక్టర్ ఎంతో ఆసక్తిగా విన్నారు. అనంతరం కేంద్రానికి వచ్చిన గర్భిణులతో మాట్లాడుతూ భోజనం ఎలా ఉంటుందని, ఏ టైమ్‌కి భోజనం పెడుతున్నారని ఆరా తీశారు. కార్యక్రమంలో శామీర్‌పేట తహసీల్దార్ యాదగిరిరెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి, ఐసీడీఎస్ సీడీపీవో శారద, తూంకుంట మున్సిపల్ కమిషనర్ జ్యోతి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

చంద్రవంచలో ఇరువర్గాల ఘర్షణ

» వినాయక నిమజ్జనం సందర్భంగా గొడవ
» అర్ధరాత్రి ఇళ్లలోకి చొరబడి దాడులు
» వారించేందుకు వెళ్లిన కానిస్టేబుల్‌కూ గాయాలు



గొడవలో గాయపడిన గ్రామస్థుడు

తాండూరు రూరల్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): వినాయక నిమజ్జన వేడుకల్లో మొదలైన గొడవ ఒకరిపైనొకరు దాడులు చేసుకునే స్థాయికి చేరింది. ఈ గొడవలో కానిస్టేబుల్ సైతం గాయపడ్డాడు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. మండలంలోని చంద్రవంచలో ఈ నెల 6న వినాయక నిమజ్జనాన్ని నిర్వహించారు. ఊరేగింపులో ఈశ్వరాలయం వద్ద రెండు వర్గాల విగ్రహాలు ఎదురుపడ్డాయి. ట్రాక్టర్‌ను పక్కకు తీస్తే తాము వెళ్లామని ఓ వర్గం యువకులు కోరారు. ఇదే విషయంలో ఇరువర్గాల యువకులు గొడవపడ్డారు. తర్వాత గ్రామ పెద్దలు పంచాయితీ పెట్టి యువకులకు నచ్చజెప్పారు. అంతా సర్దుకున్న క్రమంలో సోమవారం అర్ధరాత్రి ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. అర్ధరాత్రి రెండు వర్గాల యువకులు ఇళ్లలోకి వెళ్లి కర్రలతో కొట్టుకున్నారు. దీంతో కొందరికి తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న కరన్‌కోట్ స్టేషన్ కానిస్టేబుళ్లు బస్వరజ్, శేఖర్ గ్రామానికి వెళ్లారు. గొడవ ఆపే క్రమంలో కానిస్టేబుల్ బస్వరాజ్ తలకు గాయమైంది. అతడిని తాండూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న రూరల్ సీఐ నగేష్, ఎస్ఐ రాథోడ్ వినోద్ మంగళవారం చంద్రవంచ వెళ్లి గ్రామస్తులతో మాట్లాడి వివరాలు సేకరించారు. చంద్రవంచలో రెండు వర్గాల ఘర్షణపై 15-20 మందిపై కేసులు నమోదు చేశామని సీఐ తెలిపారు. కానిస్టేబుల్ తీసిన వీడియో ఆధారంగా గొడవలో పాల్గొన్న అందరినీ గుర్తిస్తున్నట్టు చెప్పారు. కొందరు పారిపోయారని, శాంతిభద్రతలకు విఘాతం కల్గించిన అందరిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు.



గాయపడిన కానిస్టేబుల్ బస్వరాజ్

CHANGE OF NAME

★ **I, Mohd Rabbani Mullawala S/o Mohd Gani Mullawala** R/o 2-1-20/21, Opposite To Hussain Masjid, National Garden, Tandur, Vikarabad, Telangana-501141, have changed my name to **Mohd Rabbani.** AJH-21979

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం!

● 'భగీరథ' నీటిలోకి చేరుతున్న మురుగు
● ఇబ్బందులు ఎదుర్కొంటున్న కాలనీవాసులు


ఇందిరానగర్‌లో రోడ్డుపై పారుతున్న మురుగునీరు

వికారాబాద్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో అండర్ డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. గతంలో శాటిలైట్‌టౌన్‌లో భాగంగా ఏర్పాటు చేసిన డ్రైనేజీ ఇప్పుడు అనేక సమస్యలను సృష్టిస్తోంది. డ్రైనేజీ లీకేజీల వల్ల మిషన్ భగీరథ నీటిలో మురుగు నీరు కలుస్తోంది. నీళ్లు కంపుకొడుతున్నాయని పట్టణంలోని 34వ వార్డు వెంకటేశ్వర కాలనీతో పాటు 18వ వార్డు ఇందిరానగర్, 30వ వార్డు ప్రజలు ఆరోపిస్తున్నారు. బోర్లలోనూ నీరు కలుషితమవుతోందని, డ్రైనేజీ పొంగి రోడ్లపై ప్రవహిస్తోందని వాపోతున్నారు. యూజీడీకి సంబంధించి ఒకే వాహనం ఉండడంతో 34వార్డులకు ఇబ్బందిగా మారుతోందని స్థానికులు తెలిపారు. సమయానికి డ్రైనేజీలను క్లీన్‌చేసే వాహనాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

తెలంగాణ ఉద్యమ ప్రతిధ్వని కాళోజీ

దుద్యాల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమ ప్రతిధ్వని కాళోజీ నారాయణరావు అని వక్తలు కొనియాడారు. దుద్యాల మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో కాళోజీ నారాయణరావు 111వ జయంతిని మంగళవారం నిర్వహించారు. కాళోజీ చిత్రపటానికి ఎంఈవో విజయరామారావు, టీవీవీ రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్ ఉపాధ్యాయులతో కలిసి నివాళులర్పించారు.

తాండూరు: కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా తాండూరు మున్సిపాలిటీలో ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ యాదగిరి, మేనేజర్ నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

దౌల్తాబాద్: కాళోజీ జయంతిని మంగళవారం దౌల్తాబాద్‌లోని పీఎంశ్రీ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు ఉపాధ్యాయులు సాయిలు గౌడ్, రేణుక, చంద్రశేఖర్, విద్యార్థులు కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పరిగి: పరిగిలో ఉద్యమకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు శ్రీనివాస్, డి.వెంకటయ్య, గోవింద్‌నాయక్ పాల్గొన్నారు. అదేవిధంగా మునిసిపల్ కార్యాలయంలో కమిషనర్ వెంకటయ్య ఆధ్వర్యంలో కాళోజీకి నివాళులర్పించారు.

వికారాబాద్: సిద్దులూరు జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో కాళోజీ నారాయణరావు జయంతి, తెలంగాణ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎస్‌బీఐ రిటైర్డు జనరల్ మేనేజర్, కవి గోపాలాచారి మాట్లాడుతూ కాళోజీ నారాయణరావు నిజాం నిరంకుశ విధానాలను తన కవితలతో ధైర్యంగా ఎదిరించారన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు వినోద్ కుమార్, ఉపాధ్యాయులు ప్రతాప్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


దుద్యాల: కాళోజీకి నివాళులర్పిస్తున్న టీవీవీ రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్, ఎంఈవో


మేడ్చల్ టౌన్: కాళోజీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న మేడ్చల్ మున్సిపల్ సిబ్బంది

కొడంగల్ రూరల్: కాళోజీ జయంతిని పురస్కరించుకుని మంగళవారం తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ప్రిన్సిపాల్ రామదాసు కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంజేపీటీ కళాశాలలో కాళోజీ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు నివాళులు అర్పించారు.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో..

మేడ్చల్ టౌన్: మేడ్చల్ మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ చంద్రప్రకాశ్‌రెడ్డి కాళోజీ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో మున్సిపల్ సిబ్బందితో పాటు నాయకులు జయంతి వేడుకలు నిర్వహించారు.

కీసర రూరల్: తెలంగాణ భాషా దినోత్సవం సందర్భంగా దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ వెంకట్ రెడ్డి మహాకవి కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అదేవిధంగా మున్సిపల్ కార్యాలయ ఆవరణలో వంద రోజుల ప్రణాళిక ముగింపు సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు.

శామీర్‌పేట: స్థానిక గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం ప్రిన్సిపాల్ డాక్టర్ ఇష్రత్ ఆధ్వర్యంలో కాళోజీ నారాయణరావు జయంతి, తెలంగాణ భాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజీ చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చేతన, తెలుగు హెచ్‌వోడీ డాక్టర్ హర్షిత పాల్గొన్నారు. అదేవిధంగా తూంకుంట మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ జ్యోతి మేడ్చల్ జిల్లా ఆర్‌టీఏ సభ్యుడు జైపాల్‌రెడ్డి, మున్సిపల్ మేనేజర్ శ్రావణ్‌కుమార్ కాళోజీకి నివాళులర్పించారు.

కీసర: కాళోజీ జయంతి, తెలుగుభాషా దినోత్సవం సందర్భంగా మంగళవారం నాగారం మున్సిపల్ పరిధిలోని జూబ్లీహిల్స్ పబ్లిక్‌స్కూల్‌లో వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు చేసిన నృత్యాలు, పాటలు ఎంతగానో అలరించాయి. ప్రిన్సిపాల్ సంతోష్ పాల్గొన్నారు.


కీసర: జూబ్లీహిల్స్‌పబ్లిక్ స్కూల్‌లో విద్యార్థుల నృత్యాలు

క్రైం కార్నర్

పురుగుల మందు తాగి వృద్ధుడి మృతి

బషీరాబాద్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం సరిగా లేని ఓ వృద్ధుడు పురుగుల మందు తాగి మృతిచెందాడు. ఈ ఘటన బషీరాబాద్ మండలం మంతట్టిలో మంగళవారం జరిగింది. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన హనుమప్ప(60) కల్లు తాగే అలవాటు ఉంది. అతడికి కొంత కాలంగా మతిస్థిమితం జరిగాలేదు. కాగా మంగళవారం ఉదయం అతడి కుమారుడు నర్సింహులు వ్యవసాయ పొలంలో పత్తి పంటకు పురుగుల మందు తీసుకొచ్చి ఇంట్లో ఉంచాడు. కల్లు తాగిన మైకంలో ఇంట్లో నిల్వ ఉంచిన మందును తీసుకుని తాగి స్పృహ కోల్పోయి కింద పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు 108అంబులెన్స్‌లో తాండూరు జిల్లా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి భార్య తలారి తుల్జామ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎమ్మార్సీ భవనంలో ల్యాప్‌టాప్ చోరీ

పెద్దేముల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో ల్యాప్‌టాప్ చోరీకి గురైంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జనగాం గ్రామానికి చెందిన శ్రీశైలం ఎమ్మార్సీ భవనంలో ఆధార్ అప్‌డేట్ నిర్వహించేవాడు. అందుకు అవసరమైన ల్యాప్‌టాప్, ఇతర సామగ్రిని ఒక టేబుల్‌పై ఏర్పాటు చేసుకుని తన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాడు. సోమవారం యథావిధిగా తన పనులు ముగించుకుని ఎమ్మార్సీ భవనానికి చేరుకున్నాడు. అక్కడ తాను పెట్టిన ల్యాప్‌టాప్ కనిపించలేదు. టేబుల్‌పై ఉంచిన సామగ్రి చిందరవందరగా మారింది. ల్యాప్‌టాప్ పెట్టిన టేబుల్ సమీపంలోని కిటికీని తెరిచి అందులో నుంచి ల్యాప్‌టాప్ చోరీ చేసినట్లు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు విచారణ చేపడుతున్నట్లు ఎస్ఐ వేణుకుమార్ తెలిపారు.

మెడలో పుస్తెలతాడు అపహరణ

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ క్షేత్రం వద్ద పనిచేస్తున్న ఓ మహిళ మెడలో బంగారు పుస్తెలతాడును లాక్కెళ్లిన ఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, అంకుశాపూర్‌నకు చెందిన అర్ద కాంతమ్మ(60) తన భర్త అర్ద బుచ్చిరెడ్డితో కలిసి మంగళవారం సాయంత్రం వ్యవసాయక్షేత్రం వద్దకు వెళ్లారు. వరి పొలంలో భర్త యూరియా చల్లుతుంటే కాంతమ్మ బకెట్‌లో మందును భర్తకు అందిస్తోంది. ఈ క్రమంలో ఓ దుండగుడు(20 నుంచి 25వయస్సు) వెనుక నుంచి వచ్చి కాంతమ్మ మెడలో ఉన్న ఆరు తులాల బంగారు పుస్తెలతాడును లాక్కెళ్లాడు. కాంతమ్మ కేకలు వేయడంతో హుటాహుటిన భర్త బుచ్చిరెడ్డి వరి పొలంలో నుంచి రోడ్డుపైకి వచ్చేసరికి దుండగుడు పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి దుండగుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

ఇంటి ఎదుట నిలిపిన బైక్ చోరీ

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఇంటి ఎదుట నిలిపిన బైక్ చోరీకి గురైన ఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రాజువర్మ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఇస్మాయిల్‌ఖాన్ గూడకు చెందిన గుండోజి మంజునాద్ గతనెల 30వ తేదీన తన రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌ను ఇంటి ఎదుట నిలిపాడు. మరుసటి రోజు లేచి చూసేసరికి బైక్ కనిపించలేదు. మంజునాథ్ పరిసరాలను వెతికినా బైక్ లభ్యంకాలేదు. దీంతో మంగళవారం పోచారం ఐటీ కారిడార్ పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వీధి దీపాలు ఏర్పాటు చేయాలి


మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): మేడ్చల్-కిష్టాపూర్ రోడ్డు పై వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కిష్టాపూర్‌కు అర్బన వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు మంగళవారం మేడ్చల్ మున్సిపల్ కమిషనర్‌చంద్రప్రకాశ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. స్థానికులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి వీధి దీపాలు ఏర్పాటు చేయాలని వారు కోరారు.

బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులకు సత్కారం


గౌతంరావు, వీరేందర్‌గౌడ్, అశోక్‌లను సత్కరించిన మాజీ ఎంపీపీ

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులుగా నియమితులైన గౌతంరావు, తూల వీరేందర్ గౌడ్, వేముల అశోక్‌లను మంగళవారం ఘట్‌కేసర్ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల విధులు బహిష్కరణ


నిరసన తెలుపుతున్న బార్ అసోసియేషన్ సభ్యులు

కొడంగల్ రూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ బార్ అసోసియేషన్ మెంబర్‌అడ్వకేట్ సురేష్‌పై ఇటీవల జరిగిన దాడికి నిరసనగా కొడంగల్‌లో కొడంగల్ బార్ అసోసియేషన్ సభ్యులు విధులు బహిష్కరించి నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటరెడ్డి మాట్లాడుతూ న్యాయవాదులకు రోజురోజుకు రక్షణ లేకుండా పోయిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను వెంటనే తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బి.వెంకటయ్య, బస్వరాజ్, ఏవీ.ఆనంద్, ప్రభాకర్, బి.శ్రీనివాస్, ఆనంద్, బి.కృష్ణయ్య, కె.రమేష్, భానుప్రసాద్, రవీందర్ నాయక్, మొహిద్ పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం


సరళారెడ్డిని సన్మానిస్తున్న గాజుల మాధవి

తాండూరు రూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తాండూరు ప్రాంతానికి చెందిన బుయ్యని సరళాశ్రీనివాస్‌రెడ్డి బిజినెస్ ఎక్సలెన్స్ అవార్డును అందుకున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా మంగళవారం తాండూరు పట్టణ మహిళా అధ్యక్షురాలు గాజుల మాధవి, హర్షియా, సుమలత, జయశ్రీలు అవార్డు గ్రహీత సరళారెడ్డిని కలిసి సన్మానించారు. ఇలాంటి అవార్డులు మరిన్ని అందుకోవాలని ఆకాంక్షించారు.

యాలాల ఎస్ఐగా విఠల్‌రెడ్డి



యాలాల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): యాలాల ఎస్ఐగా విఠల్‌రెడ్డిని ఉన్నతాధికారులు నియమించారు. ప్రస్తుతం ఇక్కడ పని చేస్తున్న ఎస్ఐ విఠల్‌కు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. తాండూరు రూరల్ పోలీస్‌స్టేషన్ నుంచి వచ్చిన ఎస్ఐ విఠల్‌రెడ్డి మంగళవారం ఎస్ఐగా బాధ్యతలు చేపట్టారు.

న్యాయం చేయాలని అధికారులకు వినతి

కొడంగల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి):మున్సిపల్ అభివృద్ధిలో భాగంగా చేపడుతున్న రోడ్డు విస్తరణలో పురాతన మసీద్‌లు, స్మశాన వాటికలు, దర్గాలతో పాటు మసీద్‌ల నిర్వాహణకు నిర్మించిన దుకాణసముదాయాలు కోల్పోవడం జరుగుతుందని మైనారిటీ నాయకులు వాపోయారు. మంగళవారం మైనారిటీ నాయకులు ఎస్ఎం.గౌసన్ ఆధ్వర్యంలో స్థానిక కడా కార్యాలయంలో అధికారికి, పోలీస్‌స్టేషన్‌లో సీఐ శ్రీధర్‌రెడ్డికి వినతి పత్రాలు అందజేశారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూడాలని వారు కోరారు.

ట్రిపుల్‌ఆర్‌పై భగ్గు

(ఐదో పేజీ తరువాయి)

ఇచ్చేది లేదంటూ అధికారులకు స్పష్టం చేస్తున్నారు.

22 గ్రామాల మీదుగా...

వికారాబాద్ జిల్లాలో మోమిన్‌పేట్, నవాబ్‌పేట్, పూడూరు, వికారాబాద్ మండ లాల పరిధిలో 22 గ్రామాల మీదుగా రీజినల్ రింగ్ రోడ్డు ప్రతిపాదించారు. మోమిన్‌పేట మండలంలో దేవరంపల్లి, టేకులపల్లి, నవాబ్‌పేట మండలంలో చించల్‌పేట, చిట్టిగిద్ద, దాతాపూర్, వట్టిమీనపల్లి, యావాపూర్, పూడూరు మండలంలో గొంగుపల్లి, ఘట్‌పల్లి, కెరవెల్లి, మంచన్‌పల్లి, మన్నెగూడ, పెద్ద ఉమ్మెంతాల్, పూడూరు, రాకంచర్ల, సిరిగాయపల్లి, తుర్క ఎన్కేపల్లి, ఎన్కేపల్లి, వికారాబాద్ మండలంలో బురాన్‌పల్లి, పాతూరు, పీరంపల్లి, పులుసుమామిడి గ్రామాల మీదుగా ట్రిపుల్ ఆర్ఆర్ కొనసాగనుంది. ఈ గ్రామాల పరిధిలో 338 సర్వే నెంబర్ల భూముల్లో నుంచి ఆర్ఆర్ఆర్ వెళ్లనుండగా, తుర్క ఎన్కేపల్లిలో ఏయే సర్వే నెంబర్ల మీదుగా ట్రిపుల్ ఆర్ వెళ్లనుందనేది స్పష్టత లేదు. ఇతర గ్రామాల్లో ట్రిపుల్ ఆర్ ప్రభావిత సర్వే నంబర్లను సూచించినా ఎంత మంది రైతులు ఎంత విస్తీర్ణంలో భూములను కోల్పోతున్నారనేది ఇంకా హెచ్ఎండీఏ అధికారులు స్పష్టత ఇవ్వలేదు.

బడా బాబులకు లాభం చేకూర్చేందుకే..

కోట్లాది రూపాయల విలువ గల తమ భూములను రీజినల్ రింగ్ రోడ్డులో కోల్పోతున్నామనే ఆందోళన రైతుల్లో వ్యక్తమవుతోంది. బీడు భూములు, అసైన్డ్ భూములు కాకుండా సాగు చేసే పట్టా భూములు కోల్పోవాల్సి రావడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. బడా బాబులకు లాభం చేకూర్చేందుకే అలైన్‌మెంట్ మార్చారంటూ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తుతున్నారు. భూములను కోల్పోయే నిర్వాసితులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇచ్చే పరిహారం నచ్చని రైతులు తమ భూములను కాపాడుకునే మార్గాలను అన్వేషిస్తున్నారు. ఏ సర్వే నంబర్‌లో ఏ మేర భూములను కోల్పోనున్నారనేది స్పష్టత లేకపోయినా రైతులు ట్రిపుల్ ఆర్‌కు ఇచ్చేందుకు ససేమిరా అంటున్నారు.

15వరకు అభ్యంతరాలకు గడువు

ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) తరహాలోనే రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) నిర్మాణం కొనసాగనుంది. వంద మీటర్ల వెడల్పుతో నిర్మించనున్న ఈ రోడ్డుకు 15 మీటర్ల వరకు బఫర్ జోన్ ఏర్పాటు చేయనున్నట్లు చెబుతున్నారు. ఆర్ఆర్ఆర్ అలైన్‌మెంట్‌ను ఖరారు చేస్తూ హెచ్ఎండీఏ జారీ చేసిన ప్రాథమిక నోటిఫికేషన్‌లో డిజిటల్ మ్యాప్‌తో సహా ఏ గ్రామంలో ఏయే సర్వే నంబర్ల మీదుగా వెళ్లనుందనేది స్పష్టత ఇచ్చారు. నోటిఫికేషన్ పైన ప్రజలు, సంస్థల నుంచి రాతపూర్వకంగా అభ్యంతరాలు స్వీకరించేందుకు 15వ తేదీ వరకు గడువు విధించారు.

రైతుల ఆందోళనలు...

ట్రిపుల్ ఆర్ నిర్మాణానికి తమ భూములు ఇచ్చేది లేదంటూ ఇప్పటికే నవాబ్‌పేట మండలం, చిట్టిగిద్ద రైతులు హెచ్ఎండీఏ కార్యాలయానికి వెళ్లి తమ అభ్యంతర పత్రం అందజేశారు. పూడూరు మండల రైతులు ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్‌ను నిరసిస్తూ ఆదివారం అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి తమ నిరసన వ్యక్తం చేశారు. కాగా, ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్‌ను నిరసిస్తూ సోమవారం నిర్వహించిన హెచ్ఎండీఏ కార్యాలయం ముట్టడి కార్యక్రమానికి జిల్లా నుంచి ప్రభావిత గ్రామాల రైతులు భారీగా తరలివెళ్లారు. అలాగే వికారాబాద్ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలోనూ అలైన్‌మెంట్‌పై అభ్యంతరం వ్యక్తం చేస్తూ చిట్టిగిద్ద రైతులు అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌కు వినతిపత్రం అందజేశారు. పాత అలైన్‌మెంట్ ప్రకారం రోడ్డు నిర్మాణం చేపట్టాలని రైతులు డిమాండ్ చేశారు. అలాగే ఆర్ఆర్ఆర్ అలైన్‌మెంట్ మార్చాలని డిమాండ్ చేస్తూ మంగళవారం పూడూరు మండల రైతులు ర్యాలీగా తరలి వచ్చి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేసి అధికారులకు వినతిపత్రం అందజేశారు. అనంతరం అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

ఘనంగా ఎమ్మెల్యే మల్లారెడ్డి జన్మదిన వేడుకలు


అన్నోజిగూడలో కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఘట్‌కేసర్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి జన్మదిన వేడుకలను మంగళవారం ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీల పరిధిలో బీఆర్ఎస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. పోచారం మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడ బ్రిడ్జి కింద బీఆర్ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు మందడి సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కేట్‌కట్‌చేసి కార్యకర్తలు సంబురాలు చేసుకున్నారు. పోచారం మున్సిపల్ మాజీ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. మంత్రిగా పనిచేసిన సమయంలో పోచారం మున్సిపాలిటీలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి మున్సిపాలిటీని అన్ని రంగాల్లో ముందుంచినట్లు కొండల్‌రెడ్డి గుర్తుచేశారు. ఘట్‌కేసర్‌లోనూ బీఆర్ఎస్ శ్రేణులు స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శేఖర్, రెడ్డియా, బాల్‌రెడ్డి, సాయిరెడ్డి, సత్తిరెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, నర్సింహ, హరిప్రసాదరావు, రవీందర్ పాల్గొన్నారు.

తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ బదిలీ


బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్‌ను సన్మానిస్తున్న రైతులు

బషీరాబాద్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): బషీరాబాద్‌లోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు(మైల్వార్‌శాఖ) ఫీల్డ్ అఫీసర్ నరేందర్‌రెడ్డి కోదాడకు బదిలీ అయ్యారు. మంగళవారం బ్యాంకు వద్దకు చేరుకున్న రైతులు సోంపల్లి హన్మంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఫీల్డ్ అఫీసర్‌ను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఆయన రైతులకు అందించిన సేవలను ఈ సందర్భంగా ప్రశంసించారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న మాజీ సర్పంచ్ శిరీషదస్తప్ప

బషీరాబాద్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రెడ్డిఘణాపూర్ పాఠశాల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ఎంపికైన బాలమణిని స్థానిక మాజీ సర్పంచ్ శిరీషదస్తాప్ప మంగళవారం సన్మానించారు. అదేవిధంగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకోని పాఠశాల జీహెచ్ఎం శ్రీదేవి, ఉపాధ్యాయులు రవికాంత్, జగదీశ్, చంద్రశేఖర్, హన్మంతునాయక్, రవికుమార్, అన్నపూర్ణ, ఎల్లప్ప శరణ్‌లను మాజీ సర్పంచ్ శాలువ కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో విద్యాకమిటీ మాజీచైర్మన్ వెంకటయ్య పాల్గొన్నారు.

బొంరాస్‌పేట: మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల నుంచి 10మంది ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక కాగా మంగళవారం బొంరాస్‌పేట్ ఎమ్మార్సీ ఆవరణలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, రాంచంద్రారెడ్డి, నర్సిములుగౌడ్, మల్లేశ్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో హరిలాల్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు అనిల్ కుమార్, బాకారం చంద్రశేఖర్, గౌరారం గోపాల్, రవీందర్‌గౌడ్, మల్లయ్య పాల్గొన్నారు.

కులకచర్ల: ఘనపూర్ గ్రామంలోని పాఠశాలలో మంగళవారం యువజన సంఘాల ఆధ్వర్యంలో గురుపూజోత్సవం నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని ఉపాధ్యాయులు విజయ్, నర్సిములు, కవిత, వెంకట్రాములును సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీఎన్ పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్, యువజన సంఘం నాయకులు శివ, ఆంజనేయులు, హనుమంతు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఇంటి అక్రమ నిర్మాణాన్ని ఆపాలి


ప్రజా సంఘాల నాయకులతో మాట్లాడుతున్న ఎస్పీ

దోమ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): దిర్సంపల్లి గ్రామ సర్వే నెం.16/1లో అక్రమంగా నిర్మిస్తున్న ఇంటి నిర్మాణాన్ని ఆపాలని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మంగళవారం దోమ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుతో ఎస్పీ నారాయణరెడ్డికి వినతి పత్రం అందించారు. గ్రామానికి చెందిన కూర శ్రీశైలం 2014లో అదే గ్రామానికి చెందిన వడ్ల కృష్ణయ్య దగ్గర సర్వే నంబరు 16/1లో ప్లాట్ నంబరు 77లో 135గజాల ప్లాటును కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్నాడని తెలిపారు. ఇట్టి ప్లాట్‌ను శ్రీశైలం అన్న తమకు అమ్మాడని అదేగ్రామానికి చెందిన కొత్తకాపు నర్సింహారెడ్డి దౌర్జన్యంగా ఇంటి నిర్మాణం చేపట్టినట్లు ఆరోపించారు. డీఎస్పీ శ్రీనివాస్‌తో మాట్లాడి పూర్తిస్థాయిలో విచారణతో చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు.

400మొక్కలు నాటితే రూ.12వేలు

మోమిన్‌పేట్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో భాగంగా ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు 400మొక్కలు నాటితే వాటి సంరక్షణకు రూ.12వేలు అందించనున్నట్లు ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. పంచాయతీలో మంగళవారం నిర్వహించిన గ్రామసభలో ఆమె మాట్లాడారు. 2022-23 నుంచి 2024-25 వరకు మోమిన్‌పేట్ గ్రామ పంచాయతీకి ఉపాధిహామీ పథకంలో పెంచుతున్న అవెన్యూ, కమ్యూనిటీ ప్లాంటేషన్‌లో మొక్కల సంరక్షణ, పోషణకు కిలో మీటర్‌లో ఉన్న 400మొక్కలకు, అదే విధంగా రెండున్నర ఎకరాల విస్తీర్ణంలో ఉన్న దాదాపు 1125 మొక్కలకు సంవత్సరానికి రూ.12వేలు చొప్పున అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో యాదగిరి, ఏపీవో శంకరయ్య, ఈసీ వికాస్, పంచాయతీ కార్యదర్శులు నర్సిములు, స్వప్న, అన్నపూర్ణ పాల్గొన్నారు.


గ్రామసభలో మాట్లాడుతున్న అధికారులు

చికెన్ బిర్యానీలో బొద్దింక!

● హోటల్ యజమానికి రూ.25వేలు జరిమానా


బిర్యానీలో బొద్దింక


జరిమానా విధిస్తున్న అధికారులు

తాండూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తాండూరు పట్టణం దుర్గా గ్రాండర్ హోటల్‌లో మంగళవారం తాండూరు పట్టణానికి చెందిన జశ్వంత్ చికెన్ బిర్యానీని ఆర్డర్ చేసి భోజనం చేస్తుండగా అందులో బొద్దింక కనిపించింది. దీంతో హోటల్ యాజమాన్యాన్ని ప్రశ్నించగా వారు నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు. దీంతో వారిపై చర్యలు తీసుకోవాలని జశ్వంత్ మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశాడు. దీంతో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య ఆధ్వర్యంలో సిబ్బంది హోటల్‌లో తనిఖీలు నిర్వహించారు. బిర్యానీలో బొద్దింక నిజమని తేలడంతో హోటల్ యజమానికి రూ.25వేలు జరిమానా విధించారు. గతంలో దుర్గా గ్రాండ్ హోటల్‌పై అనేక ఫిర్యాదులు ఉన్నప్పటికీ రాజకీయ అండదండలతో హోటల్‌ను నెట్టుకుంటూ వస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

హైకోర్టు తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు

● బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్



వికారాబాద్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1పై హైకోర్టు తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టు అని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్ అన్నారు. గ్రూప్-1 పరీక్షల కేసులో మెయిన్స్ పరీక్షలు మళ్లీ నిర్వహించాలని టీజీపీఎస్సీని హైకోర్టు ఆదేశించడంతో నిరుద్యోగ యువతకు న్యాయం జరిగిందన్నారు. ఎన్నో అవకతవకలతో పరీక్షలు నిర్వహించి విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న కాంగ్రెస్ సర్కార్‌కు హైకోర్టు తీర్పు చెంప పెట్టులాంటిదన్నారు. కేసీఆర్‌పై, బీఆర్ఎస్‌పై సీఎం రేవంత్‌రెడ్డి విమర్శలు చేయడంపై ఉన్న పెట్టిన శ్రద్ధ విద్యార్థుల భవిష్యత్తుపై పెడితే బాగుంటుందని హితవు పలికారు. ఇప్పటికైనా విద్యార్థులకు, నిరుద్యోగులకు క్షమాపణలు చెప్పి, హైకోర్టు ఆదేశాల ప్రకారం ఇచ్చిన గడువులోపు రీవాల్యువేషన్ లేదా రీమెయిన్స్ పరీక్ష నిర్వహించి విద్యార్థుల గందరగోళానికి తెరదించాలని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పంటల వివరాలను నమోదు చేసుకోవాలి


పంట వివరాలను ఆన్‌లైన్ నమోదు చేస్తున్న ఏడీఏ శంకర్‌రాథోడ్

బొంరాస్‌పేట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రైతులు సాగుచేసిన పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని వ్యవసాయ శాఖ కొడంగల్ ఏడీఏ శంకర్‌రాథోడ్ అన్నారు. మెట్లకుంట గ్రామంలో మంగళవారం పంట పొలాలను పరిశీలించారు. పంట నమోదు ఆధారంగానే కొనుగోలు, నష్టపరిహారం, రైతుభరోసా వంటి పథకాలకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు పవన్, జగదీశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.